క్లుప్తంగా

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధితుడు శేఖర్‌ను పరామర్శిస్తున్న సిద్ధూ

మండపేట: పట్టణానికి చెందిన దళిత యువకులపై దాడి కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకుడు భీమశంకర్ కోరారు. వారు శనివారం మండపేటలో బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దళితులకు రక్షణ లేదనడానికి ఏడిద సంఘటన సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. దాడి కేసులో నమోదైన 8 మంది కాకుండా మరికొంత మంది కూడా ఉన్నారన్నారు. వారిని కూడా పట్టుకుని అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



రామచంద్రపురంలో లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు ఒకటో వార్డుకు చెందిన పర్వతిని రామాంజనేయమ్మలకు సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైంది. మంజూరైన రూ.1.62 లక్షల చెక్కును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం లబ్ధిదారుకు అందజేశారు.

గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు



కేదారిలంక రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామాల్లో శనివారం భూ సర్వే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు వీధి వెంకటరెడ్డి, సాకా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభల్లో ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీచర్లకు మధ్యంతర భృతి విడుదల చేయాలి



కె.గంగవరంలో సభ్యత్వ సేకరణ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కె.గంగవరం: ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, నాయకులు బి.డమరుకనాథం, షేక్ నౌషద్, కడియాల గోవిందరాజు డిమాండ్ చేశారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని 10 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా తాము ఒత్తిడి తేస్తామని వారు అన్నారు. ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. హెచ్‌ఎం పి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, పి.శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సోమేశ్వరం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ జగదీశ్

రాయవరం: మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి శనివారం విలేకరులకు తెలిపారు. యాళ్ల మణికంఠ (10), జోడా వెంకటదుర్గాప్రసాద్ (9), గంధం కుశ్వంత్(8వ తరగతి)లు అండర్-14, అండర్-17 త్రో బాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పోటీలకు ఎంపికయ్యేలా కోచింగ్ ఇచ్చిన పీడీ జగదీశ్‌ను ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

జోరందుకున్న ఖరీఫ్ వరి కోతలు

- పొలాలకు చేరుకుంటున్న యంత్రాలు
- క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో వరిసాగు



వరి కోత కోస్తున్న కూలీలు



నియోజకవర్గానికి చేరుకుంటున్న వరి కోత యంత్రాలు

రాయవరం: తుపాను ముప్పు తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు వరికోతలు, ధాన్యం నూర్పిళ్లపై దృష్టి సారించారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో అన్నదాతలు వరి కోతలను ప్రారంభించారు. బోర్లపై సాగు చేసిన పంట పక్వానికి రావడంతో అమావాస్యకు ముందే వరి కోతలు ప్రారంభించారు. ఆలస్యంగా నాట్లు వేసిన పొలాలు సైతం కోతలకు రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దీపావళి అమావాస్య వెళ్లడంతో రైతులు పూర్తిగా వరి కోతలపై దృష్టి సారించారు. ముఖ్యంగా యంత్ర సాయంతో వరి కోతలు చేపడుతున్నారు.

కోత యంత్రాలకే ప్రాధాన్యం

ఖరీఫ్‌పై ఈశాన్య రుతు పవనాల ప్రభావం చూపించక ముందే పండిన పంటను ఒబ్బిడి చేసుకోవాలనే ఉద్దేశంతో పలువురు రైతులు యంత్రాల సాయంతో వరి కోతలు కోస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌లోనే ఎక్కువగా యంత్రాల సాయంతో వరికోతలు చేపట్టేవారు. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో కూడా వరికోత యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వరికోత యంత్రానికి గంటకు రూ. 2,400 నుంచి రూ.2,600 చెల్లిస్తున్నారు. దీంతో ఇప్పటికే వరికోత యంత్రాలు వివిధ మండలాలకు చేరుకున్నాయి. వాటికి డిమాండ్ పెరగడంతో మరిన్ని వస్తున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేశారు. 80 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగు చేయగా మిగిలిన 20 శాతం ఎంటీయూ 1318, ఎంటీయూ 3626 (బొండాలు) తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం పంట ఎక్కడికక్కడ కోత దశకు చేరుకోవడంతో వరికోతలు ముమ్మరంగా సాగిస్తున్నారు.

పెరిగిన కూలి రేట్లు

వాతావరణం అనుకూలించడంతో అందరూ ఒక్కసారిగా వరికోతలు ప్రారంభించడంతో కూలి రేట్లు పెరిగాయి. పురుష కూలీలకు ఒక్కొక్కరికి రూ.800 చెల్లిస్తుండగా, మహిళా కూలీలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు. సాధారణంగా ఎకరా వరిచేనును కోయడానికి సుమారుగా ఆరుగురు కూలీలు అవసరం అవుతారు. అయితే గత వర్షాలకు నేల నంటిని వరి చేలను కూలీలతోనే కోత కోయించాల్సి ఉండడంతో తొమ్మిది మంది వరకూ కూలీలు అవసరమవుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

దిగుబడి నిరాశాజనకం

ఖరీఫ్ ప్రారంభం నుంచి విడవకుండా కురిసిన వర్షాల కారణంగా ధాన్యం దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఈనిక దశలో వర్షం కారణంగా పిట్టపోటు, తెల్లకంకి వచ్చింది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని రైతులు చెబుతున్నారు. గత ఖరీఫ్‌లో ఎకరాకు 35–40 బస్తాల దిగుబడి రాగా, ఈ ఏడాది 25–30 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు.

యంత్రాలతోనే సులువు



వరి కోతలు యంత్రాలతో కోయడం సులువుగా ఉంటుంది. కూలీల కొరత నేపథ్యంలో యంత్రాల వినియోగం తప్పనిసరి అవుతోంది. మా ప్రాంతంలో ఎక్కువగా యంత్రాలనే వినియోగిస్తున్నాం.

–తాడి గంగిరెడ్డి, పసలపూడి, రాయవరం మండలం

ముమ్మరంగా పనులు



వాతావరణం అనుకూలించడం, అమావాస్య వెళ్లడంతో రైతులు వరికోతలు చురుగ్గా చేపట్టారు. ఇప్పుడిప్పుడే వరికోత యంత్రాలు దిగుమతి అవుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 15 నాటికి 70 శాతం కోతలు పూర్తయ్యే అవకాశముంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం

కె.గంగవరం: రోడ్లపై పడిన గుంతలు కప్పే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం కె.గంగవరంలో కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కె.గంగవరం నుంచి ద్రాక్షారామ వెళ్లే రహదారిలో సుమారు 400 మీటర్ల మేర గుంతలు కప్పే పనులు త్వరలోనే పూర్తవుతాదని మంత్రి సుభాష్ చెప్పారు. రోడ్లపై గుంతలు కప్పే పనుల కోసం రామచంద్రపురం నియోజకవర్గానికి రూ. 5.64 కోట్ల మంజూరైందన్నారు. రానున్న సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను చూస్తామని ఆయన పేర్కొన్నారు. టీడీపీ నాయకులు అల్లూరి దొరబాబు, నేమాని అబ్బు, మేడిశెట్టి రవికుమార్, బీజేపీ నాయకులు కాదా వీర వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వల్లూరులో..

కపిలేశ్వరపురం: గుంతలు రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని వల్లూరులో శనివారం గుంతలు పూడ్చే పనులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో గుంతలతో ఉన్న రహదారులను త్వరితగతిన మెరుగుపర్చే పనులను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశించారు.

రేపు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

రాయవరం: దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన చలన పరికరాలను ఉచితంగా సరఫరా చేయడానికి ఈ నెల 4న ప్రత్యేక వైద్య శిబిరాన్ని రామచంద్రపురంలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కీర్తి శనివారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎలిమ్ కో సంస్థ ద్వారా అవసరమైన చలన పరికరాలను ఉచితంగా సరఫరా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కీర్తి తెలిపారు.

కౌన్సిల్ రిక్విజిషన్ సమావేశానికి మేం వ్యతిరేకం

- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- మున్సిపల్ కమిషనర్ రంగారావుకు వినతిపత్రం అందజేత



మున్సిపల్ కమిషనర్ రంగారావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

మండపేట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ రిక్విజిషన్ సమావేశానికి అనుకూలంగా తాము చేసిన సంతకాలను ఉపసంహరించుకుంటున్నామని కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మెండు బాపిరాజు, మందపల్లి రవికుమార్, నాయుడు లక్ష్మీసౌజన్య, ఎర్నేని ప్రభావతి ప్రకటించారు. వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కౌన్సిల్ రిక్విజిషన్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ టీడీపీ కౌన్సిలర్లు యరమాటి గంగరాజు, కాశిన కాశీవిశ్వనాథ్‌లు శనివారం కమిషనర్‌ను కలసి తమ సంతకాలతో కూడిన లేఖ అందించారన్నారు. 25వ వార్డులోని రైతు బజార్ సమీపంలో విజయదుర్గ ఆలయానికి దక్షిణాన మున్సిపల్ ఖాళీ స్థలం ఉందన్నారు. ఆ స్థలంలో మున్సిపల్ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు రూ.35 లక్షల మంజూరుకు అనుమతులు కోరుతూ తమ నుంచి సంతకాలు సేకరించారన్నారు. పైన పేర్కొన్న టీడీపీ కౌన్సిలర్లు మున్సిపల్ చట్టంలోని షెడ్యూల్-1 లోని రూల్ -3 ప్రకారం రిక్విజిషన్ సమావేశం ఏర్పాటు చేయాలని తమ దృష్టికి తేలేదన్నారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో చర్చించే అంశాన్ని ప్రత్యేకంగా రిక్విజిషన్ సమావేశం దృష్టికి తేవాల్సిన అవసరం లేదన్నారు. ఈ మేరకు తాము కమిషనర్ టీవీ రంగారావుకు వినతి పత్రం అందించినట్టు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు. కాగా భక్తులు, స్థానికుల కోరిక మేరకు గతంలో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. అయితే ఈ అంశాన్ని టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఆ హామీకి తమ పార్టీ కట్టుబడి ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు.

ఏడో వార్డులో తాటాకిల్లు దగ్ధం



బాధితులకు బియ్యాన్ని అందిస్తున్న నాయకులు

మండపేట: స్థానిక ఏడో వార్డు ఎస్సీ కాలనీలో శనివారం ఓ తాటాకిల్లు దగ్ధమైంది. ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటి పైకప్పు నుంచి పొగలు రావడంతో ఆ ఇంట్లో నివాసం ఉంటున్న వారంతా భయంతో బయటకు పరుగు తీశారు. స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇల్లంతా మంటలు ఎడబాకి పూర్తిగా కాలిపోయింది. మూడు పోర్షన్లు గల ఆ తాటాకింట్లో పెద్దాడ సత్యవతి, అప్పారావు దంపతులు, పోసుపల్లి లక్ష్మమ్మ, మోరంపూడి లక్ష్మిలు తమ పిల్లలతో జీవిస్తున్నారు. వారంతా ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేదలే. గృహోపకరణాలు పూర్తిగా కాలిపోవడంతో మూడు కుటుంబాల వారూ రోడ్డున పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళ అధికారులు వాహనంతో అక్కడికు చేరుకుని మంటలను అదుపు చేశారు. తహసీల్దార్ తేజేశ్వరరావు, ఆర్‌ఐ కంఠశెట్టి గౌరీ, వీఆర్వో సరిత ఘటనా స్థలానికి చేరుకుని ఆస్తి నష్టం అంచనా వేశారు. తక్షణ సాయంగా 15 కేజీల వంతున బియ్యం సరఫరా చేశారు.

దుగ్గుదుర్రు పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు చర్యలు

కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహా నాయక్



దుగ్గుదుర్రు పీహెచ్‌సీని సందర్శించిన డీఎంఅండ్ హెచ్‌ఓ నరసింహ నాయక్, వైద్యాధికారుల బృందం

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా స్థాయి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె. నరసింహ నాయక్ చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్ తదితరులు శనివారం ఈ పీహెచ్‌సీని సందర్శించి, ఇక్కడి వసతులను పరిశీలించారు. ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చెయ్యాలని కోరుతూ రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణమూర్తి స్థానికులతో కలసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకూ ప్రభుత్వ ఆదేశానుసారం దుగ్గుదుర్రు పీహెచ్‌సీని సందర్శించామని పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని నరసింహనాయక్ చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి జి స్వాతి, దుగ్గుదుర్రు సర్పంచ్ పోతుల వెంకటలక్ష్మి, సొసైటీ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి స్వామినాయుడు, జ్యోతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

కపిలేశ్వరపురం మండలం

దొరరాజు	సీఐ,మండపేట రూరల్	9440796537
డి.రవికుమార్	ఎస్సై, అంగర పోలీస్ స్టేషన్	9440900770
సాయి చంద్రిక	ఏఈ డ్రెయిన్స్, రామచంద్రపురం	8886066939
వై.వెంకటేశ్వరరావు	డిప్యూటీ ఈఈ, ఆర్‌అండ్‌ బీ, రామచంద్రపురం	9440818285
వి.వెంకటరమణ	ఏఈ, ఆర్‌అండ్‌బీ, మండపేట సబ్ డివిజన్	9440818537
జి.దుర్గాప్రసాద్	ఏపీఎం, ఐకేపీ	9652304198
డేవిడ్‌రాజు	ఎఫ్‌డీఓ, మత్స్యశాఖ	9948029350
కె.రవికిరణ్	ఏపీఓ, ఎస్‌ఆర్‌ఈజీఎస్	7702072981
డీవీ రాఘవులు	మండల ఇంజినీరింగ్ అధికారి	9966526720
కామేశ్వరరావ	ఎండోమెంట్ అధికారి	9908792945
భాస్కరరావు	మేనేజర్, ఆర్టీసీ, ఆర్సీపురం డిపో	7382825536
కేడీఎస్‌ఎస్‌కుమార్	మేనేజర్, ఆర్టీసీ, రావులపాలెం డిపో	9959225537
వెంకటేశ్వరరావు	ఏఎస్‌డబ్ల్యూఓ, సోషల్ వెల్ఫేర్	9492168780
కె.శివనాగమల్లేశ్వరరావు	కార్మికశాఖ అధికారి	9492555059
డీఎస్ఎన్ మూర్తి	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	9849352664
నాగేశ్వరరావు	ఎక్సైజ్ సీఐ ఆలమూరు	9701287828
కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	8712625210

కార్తికం.. కమనీయం.. పవిత్రం



విశేష అలంకరణలో కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి



సోమేశ్వరంలో ప్రత్యేకాలంకరణలో అలరారుతున్న బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కపిలేశ్వరపురం: పరమ శివుని కొలిచే కార్తిక మాసం ఆరంభం కమనీయమైంది. గ్రామాలు ఆధ్యాత్మికతతో శోభాయమానంగా మారాయి. ఆలయాల గోపురాలు సుందరమై ముక్కంటి దర్శనానికి తరలి వచ్చిన భక్తులకు స్వాగతం పలికాయి. కోవెలలో కొలనులు దీపకాంతులతో కనువిందు చేశాయి. మండలంలోని 19 గ్రామాల్లో శనివారం కార్తిక మాసం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కోరుమిల్లిలోని నాలుగో అష్ట సోమేశ్వరాలయమైన రాజ రాజేశ్వరీదేవీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరపురంలోని అగస్త్యేశ్వర, పాప వినాశేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, త్రయంబకేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి ఆలయాల్లో కార్తిక పూజలు ఘనంగా జరిపారు. భక్తులు తెల్లవారుజామునే భక్తి శ్రద్ధలతో పుణ్య స్నానమాచరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లో గౌతమి నది పుష్కరఘాట్‌లు, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల భక్తులు కోరంగి కెనాల్ రేవులు, అంగర, పడమర ఖండ్రి, టేకి, మాచర గ్రామాల ప్రజల టేకి డ్రైన్ రేవులు సందడిగా మారాయి.

రామచంద్రపురం మండలంలో..

రామచంద్రపురం రూరల్: కార్తికమాసం సందడి మొదలైంది. కార్తికమాసం ప్రారంభం పురస్కరించుకుని మహిళలు పాడ్యమి పూజలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ప్రముఖ శైవ క్షేత్రం ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో తెల్లవారుజామున అరటిడొప్పలపై ఆవు నేతితో వత్తులను వెలిగించి కార్తిక దామోదరుడిని మహిళలు వదిలి పెట్టారు. అనంతరం భీమేశ్వర స్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వెలంపాలెం బ్రహ్మగుండం, వెల్ల కాలువ వద్ద, ఏరుపల్లి శివాలయం, తదితర ఆలయాల వద్ద భక్తులు కార్తిక స్నానాలు ఆచరించారు.

రాయవరం మండలంలో..

రాయవరం: కార్తిక మాసం ప్రారంభం కావడంతో తొలిరోజు శనివారం ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. వేలాదిగా భక్తులు ఉదయాన్నే ఆలయాలకు పోటెత్తారు. మహిళలు ఉదయం నాలుగు గంటలకే లేచి ప్రత్యేక పూజలు, దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని పూజాదికాలు నిర్వహించారు. కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా కార్తికమాసం తొలి రోజు శనివారం కావడంతో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని సోమేశ్వరం, రాయవరం, వెంటూరు, చెల్లూరు తదితర గ్రామాల్లో శైవాలయాలు, వైష్ణవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

కార్తిక దీపోత్సవానికి నేడు రాట ముహూర్తం

రామచంద్రపురం రూరల్: ఏటా కార్తిక మాసంలో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించే కార్తిక దీపారాధన మహోత్సవానికి నేటి ఉదయం 7.33 గంటలకు రాట ముహూర్తం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మేడిశెట్టి కృష్ణదాసు శనివారం విలేకరులకు తెలిపారు. ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి చేతుల మీదుగా నిర్వహించే రాట ముహూర్తం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సోదరి ప్రేమకు చిహ్నం ఆతిథ్యం

- నేడు భగినీ హస్త భోజన కార్యక్రమం
- దీపావళి అయిన రెండో రోజు ఆనవాయితీ
- కుటుంబ వ్యవస్థ పటిష్టతకు దోహదం



భోజనం వడ్డించిన సోదరికి కానుకలు ఇస్తున్న సోదరులు (ఫైల్)

కపిలేశ్వరపురం: భోజనం అంటే కడుపును నింపుకునే ప్రక్రియ మాత్రమే కాదు. నిండు మనస్సుతో ప్రేమ, ఆప్యాయతలను పంచుకునే పవిత్రమైన క్రియ. ప్రకృతితో పోరాడుతూ అదే ప్రకృతిలోనే జీవిస్తున్న మనిషి ప్రకృతిలోని ఇతర జీవులకంటే భిన్నమైనవాడు. సమూహ సంస్కృతితోబాటు సాటి మనిషి పట్ల, ఇతర జీవుల పట్ల మనస్సులో భావాలను కలిగినవాడు. ఆహారమైనా, వినోదమైనా ఇతరులతో కలిసి జీవితాన్ని పంచుకునే తత్వం మనిషి సొంతం. పురాతన కాలం నుంచీ మనుషులు మధ్య ప్రేమ, ఆప్యాయతలను పెంచే పురాణ, ఇతిహాసాలెన్నో ఉన్నాయి. కార్తిక మాసంలో భగినీ హస్త భోజనం ఎంతో ప్రాధాన్యతగలది. ఆదివారం జరుపుకునే భగినీ హస్త భోజన కార్యక్రమం సోదరీ సోదరుల మధ్య అన్యోన్యతకు ప్రతీక.


ఇదీ నేపథ్యం

భయ్యా దూజ్ అనే పేరుతో ఉత్తరదేశంలో బాగా ప్రాచుర్యం పొందిన భగినీ హస్త భోజనం అమితమైన ప్రాశస్త్యం కలది. దీపావళి అయిన రెండో రోజు జరుపుకుంటారు. నేపాల్‌లో సైతం జరుపుకునే ఈ కార్యక్రమాన్ని పుష్ప ద్వితీయ, యమ ద్వితీయ, కాంతి ద్వితీయ పేర్లతో కూడా పిలుస్తారు. సూర్యు భగవానుడికి కుమారుడు యమ ధర్మరాజు, కుమార్తె యమున ఉన్నారు. అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ప్రేమ, ఆప్యాయతలతో ఉంటారు. వివాహానంతరం తన ఇంటికి భోజనానికి రమ్మని సోదరుడు యమ ధర్మరాజును యమున అనేక సార్లు ఆహ్వానించినా సాధ్యపడలేదు. ఎట్టకేలకు కార్తికమాసం విదియ రోజున సోదరి ఇంటికి వెళ్లగా పిండివంటలతో ప్రేమపూర్వక భోజనం వడ్డిస్తుంది. చెల్లెలను ఏదైనా వరం కోరుకోమంటాడు. కార్తిక శుద్ధ విదియనాడు లోకంలో ఎక్కడైనా సోదరి ఇంటికి వెళ్లి భోజనం చేసిన సోదరులకు ఆయురారోగ్యాలు ప్రసాదించమని యమున కోరుకుంది. దీంతో అపమృత్యుదోషం (అకాల మరణం) లేకుండా వరమివ్వడంతో కార్తికమాసం ఆరంభమైన రెండో రోజు అన్నా చెల్లెళ్లు భగినీ హస్త భోజన కార్యక్రమం జరుపుకుంటారు.

ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా...

ఎవరెక్కడ స్థిరపడినా సోదరులు కార్తిక మాసం రెండో రోజున తమ సోదరి ఇంటికి వెళ్లి భోజనం చేస్తారు. ఆప్యాయంగా వడ్డించిన భోజనాన్ని ఆరగించి సోదరికి పసుపు, కుంకుమ, వస్త్రాలు కానుకగా ఇస్తారు. ఇలా జరుపుకోవడాన్ని వేడుకగానూ చేసుకునే కుటుంబాలు సైతం ఉన్నాయి. కొత్తపేట మండలం మందపల్లికి చెందిన గోకవరపు పేరయ్య ,మహాలక్ష్మి కుటుంబ సభ్యులు మూడేళ్లుగా ఒక్కో పుణ్య క్షేత్రంలో వేడుకగా జరుపుకుంటున్నారు. వారు ఆదివారం పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. వారికి చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 30 కుటుంబాల వరకూ కలిసి వచ్చి భోజనం చేయనున్నారు.

కుటుంబ వ్యవస్థను పటిష్టపరిచే పుణ్య కార్యం



వ్యక్తిగా జీవించే ప్రతివారూ సమాజానికి ఏదొక మంచి చేయాలి. వ్యక్తులుగా ఎక్కడెక్కడో జీవస్తున్నప్పటికీ కుటుంబ ధర్మానికి కచ్చితంగా ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలను పటిష్ట పరచుకోవాలని మన పురాణ ఇతిహాసాలెన్నో చెబుతున్నాయి. భగినీ హస్త భోజన కార్యక్ర సంస్కృతిని కొనసాగించాలి.

–ఆమంచి గణపతి శాస్త్రి, వెల్ల, రామచంద్రపురం రూరల్ మండలం